క్లుప్తంగా

52 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. దాదాపు 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 142 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 52 మందిని వివిధ కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమానికి హాజరైన నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ అలీషాఖలం, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్ మహేష్, ఏపీ ఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ రాములు కంపెనీ ప్రతినిధులతో కలిసి ఉద్యోగాలు పొందిన వారికి నియామకపత్రాలను అందజేశారు.

హోటళ్లకు జరిమానా



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనేక హోటళ్లలో రుచి, శుభ్రత కొరవడింది. బుధవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, సచివాలయ సిబ్బంది పట్టణంలోని పలు హోటళ్లలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కణేకల్లు రోడ్డులోని లక్ష్మీ ఫ్యామిలీ రెస్టారెంట్, తృప్తి గ్రాండ్ హోటళ్లలో తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, మాంసాన్ని గుర్తించి పారవేసినట్లు చెప్పారు. మరోసారి తనిఖీల్లో నిల్వ ఆహార పదార్థాలు ఉంటే హోటళ్ల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్సు లేని తృప్తి హోటల్‌కు రూ.5 వేలు, ప్లాస్టిక్ వినియోగిస్తున్న లక్ష్మీ హోటల్‌కు రూ.2500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

ఉంతకల్లులో వైద్య శిబిరం

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో వైద్యులు బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజులుగా కాలనీలో చిన్నారులు విషజ్వరాలతో బాధపడుతుండటంతో స్థానిక వైద్యాధికారిణీ శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాలనీలో ఇంటింటికీ తిరిగి జ్వరంపై సర్వే చేశారు. అనంతరం కాలనీలో పారిశుధ్య పనులు, ఫాగింగ్ చేయిస్తున్నట్లు సర్పంచ్ ముక్కన్న తెలిపారు.

సర్వర్ సమస్యతో రేషన్ కోసం పడిగాపులు



సర్వర్ పని చేయకపోవడంతో వేచి ఉన్న కార్డుదారులు

కూడేరు: సర్వర్ సమస్యతో కార్డుదారులు రేషన్ కోసం పడిగాపులు పడాల్సి వస్తోంది. మండలంలో 30 రేషన్ షాపులున్నాయి.రేషన్‌కార్డుదారులు సుమారు 12,870 మంది ఉన్నారన్నారు. 1వ తేది నుంచి రేషన్ షాపుల్లో బియ్యం, జొన్నలు, ఇతర సరుకులను డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. కాగా బుధవారం సర్వర్ సమస్యతో పలు రేషన్ షాపుల్లో మిషన్లు సరిగా పని చేయలేదు. దీంతో సరుకులు కోసం రేషన్ షాపులకు వచ్చిన కార్డుదారులు గంటల తరబడి అక్కడే పడిగాపులు కాయాల్సి వచ్చింది.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ జాతర



జాతరకు హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: నారాయణపురంలో గ్రామస్తులు మంగళవారం, బుధవారాల్లో మారెమ్మ, పోలేరమ్మ జాతర నిర్వహించారు. 30 సంవత్సరాల తర్వాత నిర్వహించిన జాతరకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నారాయణపురం వెంకటేశులు, సర్పంచ్ సుగుణ, దంపతుల ఆహ్వానం మేరకు నియోజకర్గంలోని నాయకలు భారీగా హాజరై విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, పామిడి వీరాంజనేయులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, ములకనూరు తిమ్మరాయుడు, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతం చేయాలి

రాయదుర్గంటౌన్: హిందూ సంస్కృతీ సంప్రదాయాలు, దేవాలయ ప్రతిష్టను పెంచేలా ధర్మపరిరక్షణ కార్యక్రమాలను అర్చక, పురోహితులు కృషి చేయాలని దక్షిణాంధ్ర ప్రాంత అర్చక పురోహిత ప్రముఖ్ శివశంకర్ పిలుపునిచ్చారు. స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంటకరమణస్వామి ఆలయంలో బుధవారం వీహెచ్‌పీ అర్చక పురోహిత విభాగం ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి రాయదుర్గం పట్టణంతో పాటు 20 గ్రామాల నుంచి 45 మంది అర్చకులు హాజరయ్యారు.

పథకం లేదు..పట్టించుకునేవారూ లేరు

- వడ్డీ లేని రుణాల మాట మరచిన సర్కారు
- అధిక వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్న వ్యాపారులు



క్లాక్‌టవర్ సమీపంలో కాయగూరలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు



ఉరవకొండలో రోడ్డు పక్కన పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ హయాంలో రోడ్డు సైడ్ వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు అండగా నిలిచింది.. వారికి వ్యాపార పెట్టుబడి కోసం రూ.10 వేలు వడ్డీలేని రుణం అందించి, ఆసరాగా నిలిచింది. దీంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి అప్పు తెచ్చుకునే పరిస్థితి ఉండేది కాదు. కూటమి సర్కారు వీధి వ్యాపారులను విస్మరించింది. దీంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి తెచ్చుకొని, రోజువారీ సంపాదనంతా వడ్డీలు చెల్లిస్తూ అవస్థలు పడాల్సి వస్తోంది.

ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో దాదాపు 11,300 మంది చిరు వ్యాపారులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా రూ.10 వేలు వడ్డీలేని రుణాలు అందించారు. చిన్న వ్యాపారి 18 ఏళ్లు పైబడిన వారు.. కుటుంబ ఆదాయం గ్రామాల్లో రూ.10 వేలకంటే తక్కువగా మరియు పట్టణాల్లో రూ.12వేల కంటే తక్కు ఉన్న రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై, ప్రభుత్వ, ప్రైవేట్ ప్రదేశాల్లో బండ్లపై వ్యాపారం చేసేవారు, గంపలో తలపై వస్తువులు మోసుకెళ్లేవారు లబ్ధిపొందారు. అయితే ప్రస్తుతం బ్యాంకులు వీరికి ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం పట్టించుకోకలేదని, రోజూ రూ.500 సంపాదిస్తే అందులో రూ.300 నుంచి రూ.400 వరకు వడ్డీ కింద కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని, కుటుంబాల పోషణ కష్టతరమైందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పథకం కొనసాగించాలి:

వడ్డీలేని రుణంతో వీధి వ్యాపారులకు గత ప్రభుత్వం జగనన్న తోడు పథకంతో ఎంతో అండగా నిలిచింది. అటువంటి పథకం కొనసాగించాలని వీధి వ్యాపారులు కోరుతున్నారు. ఈపథకం ఎన్నో చిరువ్యాపారుల కుటుంబాలకు అండగా ఉంది. అలాంటి పథకం ప్రస్తుతం నీలి నీడలు కమ్ముకోవడంతో వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. ఈపథకం ప్రస్తుత పథకం కొనసాగించాలని కోరుతున్నారు.

ఏడాది గడిచినా ఆ ఊసేలేదు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయ్యిందని పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకుంటుందే తప్ప వీధి వ్యాపారులకు చేసిందేమీ లేదు. వేలాది మంది వ్యాపారులకు కనీసం ఒక్క రూపాయి రుణం ఇచ్చిన పాపాన పోలేదు. 14 నెలలు గడుస్తున్నా వీధి వ్యాపారులకు పథకం రూపంలో పైసా విదిల్చిన పాపానపోలేదని వాపోతున్నారు.

ఆదుకునేవారు లేరు..



గత ప్రభుత్వం అండగా నిలిచి వడ్డీ లేకుండా రుణం ఇవ్వడం మాకు ఎంతో అసరాగా ఉండేది. ఇచ్చిన రుణంలో పండ్లు కొనుగోలు చేసుకొని ప్రతి రోజూ విక్రయించడంతో వచ్చిన డబ్బు ఇంటికి తీసుకెళ్లేవాళ్లం. ప్రస్తుతం బ్యాంకుల్లో ఒక్క పైసా కూడా రుణం ఇవ్వలేదు.
– తిప్పయ్య, చిరువ్యాపారి, ఉరవకొండ

జగనన్న మా కష్టాలు గుర్తించాడు



జగనన్న తోడు పథకంతో రూ.10వేల రుణం అందించి అప్పటి జగనన్న ప్రభుత్వం ఆదుకుంది. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క పైసా రుణం అందించలేదు. గత్యంతరం లేక బయట వ్యాపారులతో అధిక వడ్డీకి రుణం తెచ్చి వ్యాపారం చేస్తున్నాం.
– చంద్రాయుడు, వెలిగొండ, చిరువ్యాపారి

క్యాన్సర్ ప్రాణాంతకం కావొచ్చు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఉషారాణి

కూడేరు: నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకం కావొచ్చని మండల వైద్యాధికారిణి ఉషారాణి తెలిపారు. బుధవారం కూడేరు కమ్మూరులో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి ఉషారాణి, సీహెచ్ఓ జయ క్యాన్సర్ లక్షణాలను వివరించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దని, వెంటనే పరీక్షలు చేయించుకుని వైద్యం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని తీర్మానం



ముద్దలాపురంలో తీర్మాన పత్రాన్ని చూపుతున్న సర్పంచ్ ధనుంజయ్య

కూడేరు: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరుతూ బుధవారం ముద్దలాపురం, పి.నారాయణపురం పంచాయతీల్లో తీర్మానాలు చేశారు. ఆయా పంచాయతీల సర్పంచులు ధనుంజయ్య, హనుమంతరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు కూడా అందించని విధంగా ఆర్డీటీ సంస్థ నిరుపేదలకు సేవలందిస్తోందన్నారు. అలాంటి సంస్థపై కేంద్రం ఆంక్షలు విధించడం సరికాదన్నారు. కేంద్రం స్పందించి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు సంజీవరాయుడు, ముత్యాలు, మారెన్న, యశోదమ్మ, మల్లికార్జున, రామాంజనేయులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు తర్వాతే బ్రిడ్జిలపై రాకపోకలు



నాగేపల్లి వద్ద బ్రిడ్జిని పరిశీలిస్తున్న హెచ్చెల్సీ ఎస్ఈ, ఈఈ, డీఈఈలు

కణేకల్లు: హెచ్చెల్సీపై నూతనంగా నిర్మించిన బ్రిడ్జిలకు ఆర్అండ్‌బీ రోడ్లకు మధ్య ఉన్న ఖాళీస్థలంలో అప్రోచ్ రోడ్డులు వేస్తామని, ఈ పని పూర్తయ్యాక బ్రిడ్జిపై వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్ స్పష్టం చేశారు. రూ.35 కోట్లతో చేపట్టిన హెచ్చెల్సీ లైనింగ్, యూటీ (అండర్ టన్నెల్), పలు బ్రిడ్జి నిర్మాణలను హెచ్చెల్సీ ఈఈ పార్థసారథి, కణేకల్లు హెచ్చెల్సీ సబ్‌డివిజన్ డీఈఈ దివాకర్‌రెడ్డిలతో కలిసి బుధవారం పరిశీలించారు.

పరీక్షలకు పూర్తిస్థాయిలో సిద్ధం కండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీవీఈఓ వెంకటరమణనాయక్

ఉరవకొండ: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు ఇప్పటి నుండే పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డీవీఈఓ వెంకటరమణనాయక్ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఇంటర్ బాలికల కళాశాలలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ షాషావలి అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి డీవీఈఓ మాట్లాడారు. రోజూ టైం టేబుల్ ప్రకారం ఒక్కో సబ్జెక్టును చదువుకోవాలన్నారు.

ఎఫ్‌సీఆర్ఏ లైసెన్స్ కోసం 15న 'చలో అనంతపురం'



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సు పునరుద్ధరించి విదేశీ నిధులు రాకకు మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న పది వేల మందితో 'చలో అనంతపురం' నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు తెలిపారు. కళ్యాణదుర్గంలోని స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో బుధవారం ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష పొలికేక కార్యక్రమంలో భాగంగా 'చలో అనంతపురం' కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పేదలకు ఎనలేని సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌సీ లైసెన్స్ కోసం కాకుండా ఈ–స్టాంపు కుంభకోణంలో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును కాపాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌తో పాటు కేంద్ర మంత్రి అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారని విమర్శించారు. వీరికి ప్రజల సంక్షేమం ఏమాత్రమూ పట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో డీవీఎంసీ జిల్లా సభ్యులు బీసీ ఆర్ దాస్, ఆర్డీటీ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



మూగబసవన్నకట్ట వద్ద విరబూసిన బ్రహ్మకమలాలు

ఉరవకొండ: స్థానిక మూగబసవన్న కట్ట వద్ద నివాసముంటున్న వీఆర్ఏ గణేష్, లక్ష్మి దంపతుల ఇల్లు, శివరామిరెడ్డి కాలనీలో నివాసముంటున్న ఆర్టీసీ ఉద్యోగి రాజేష్ ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి బ్రహ్మ కమలాలు విరబూశాయి. ఈ సందర్భంగా బ్రహ్మకమలాలకు వారు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల వారు పెద్దసంఖ్యలో వచ్చి వాటిని తిలకించారు.

వజ్రకరూరు సర్పంచుకు రైల్వే ఎస్పీఅభినందనలు



సర్పంచు మోనాలిసాకు జ్ఞాపికను అందిస్తున్న రైల్వే ఎస్పీ రాహూల్‌మీనా

వజ్రకరూరు: వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచు మోనాలిసాను గుంతకల్లు రైల్వే డివిజన్ ఎస్పీ రాహూల్‌మీనా అభినందించారు. గుంతకల్లు ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో బుధవారం జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎస్పీ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎస్పీ వజ్రకరూరు సర్పంచు మోనాలిసాను సత్కరించి మెమోంటో అందజేశారు. ఇటీవల మోనాలిసా జాతీయస్థాయిలో సర్పంచు–సంవాద్ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన విషయం తెలిసిందే.

ఘనంగా ఏకాదశి పూజలు



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామికి బుధవారం ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు ప్రత్యేక జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పుష్పాలకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ చేశారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర , తెలంగాణ రాష్ట్రాల నుంచి తులసి మాలాధారణకు భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు.

సంక్షిప్త సమాచారం

ఆరాధన మహోత్సవం

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలోని గురుదత్త ఆశ్రమంలో వెలసిన వైరాగ్యానంద స్వామి ఆరాధన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. స్వామి విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరణ చేసి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని కామక్కపల్లి అటవీ ప్రాంతంలో రామగిరి మండలం పేరూరు గ్రామానికి చెందిన తిమ్మక్క (67) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. బుధవారం అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వజ్రకరూరు: కమలపాడు శివారు ప్రాంతంలో పేకాట స్థావరంపై బుధవారం సాయంత్రం ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేయడంతోపాటు రూ.10,830 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు

శెట్టూరు: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపవద్దని రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మోతాదుకు మించి రసాయనిక మందులు వాడొద్దు

కూడేరు: పంటల సాగులో అవసరానికి మించి రసాయనిక మందులు వాడితే పెట్టుబడి పెరిగి ఆశించిన స్థాయిలో దిగుబడులు కూడా రాకపోవచ్చని ఏఓ శుభకర్ పేర్కొన్నారు. బుధవారం అరవకూరు, కూడేరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ వేరుశనగ, కంది, ఆముదం పంటలను పరిశీలించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని తెలియజేశారు.

ఉరవకొండ రూరల్: మోపిడి గ్రామ పరిధిలో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం వేరుశనగలో వచ్చే చీడపీడల నివారణపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణుడు, సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

బెళుగుప్ప: కాలువపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం ఉద్యానశాఖ జిల్లా అధికారులు కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త యుగంధర్ ఆధ్వర్యంలో ఉద్యాన పంటలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి హాజరయ్యారు. రైతులకు ఉద్యానశాఖకు సంబంధించిన 2025–26 సంవత్సరానికి సంబందించిన సబ్సిడీ పథకాలను వివరించారు. అనంతం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు.

సేవలు సక్రమంగా అందాలి

కళ్యాణదుర్గం రూరల్: అంగన్‌వాడీ సేవలు సక్రమంగా అందాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి సూచించారు. బుధవారం కళ్యాణదుర్గం ఐసీడీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. స్టాక్, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పీడీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఉదయం 9 గంటలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఫక్రుద్దీన్, అపర్ణ, రాధమ్మ పాల్గొన్నారు.



సిడిమాను ఉత్సవంలో భక్తులను ఆశీర్వదిస్తున్న అర్చకులు చంద్రానాయక్

బెళుగుప్ప తండాలో సిడిమాను ఉత్సవం

బెళుగుప్ప: బెళుగుప్పతండాలో బుధవారం గౌరసంద్రం మారెమ్మ జాతరలో భాగంగా సిడిమాను ఉత్సవం నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం అనంతరం అర్చకుడు చంద్రానాయక్ సిడిమానుపై తిరుగుతూ భక్తులపై పూలను చల్లి ఆశీర్వదించారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలను జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సున్నీ దర్గా మసీదు కమిటీ ఆధ్వర్యంలో 4, 5 తేదీల్లో జరిగే మిలాద్–ఉన్–నబీ వేడుకలను జయప్రదం చేయాలని మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్, చమ్మా అస్లాం, అబూబక్కర్ కోరారు. వేడుకల్లో భాగంగా దర్గా మసీదులో గురువారం రాత్రి 9.30 గంటలకు ఈషా నమాజ్ అనంతరం కర్ణాటకకు చెందిన మౌలానా గులాం రబ్బానీ రజ్విసాబ్ ప్రసంగం ఉంటుందన్నారు. 5న ఉదయం 9 గంటలకు పట్టణంలో మక్కా, మదీనాలను పోలిన నమూనాలతో భారీ ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముస్లిం సోదరులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

మట్కాబీటర్ అరెస్ట్

కణేకల్లు: మండలంలోని అంబాపురం క్రాస్ వద్ద మట్కా రాస్తున్న సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సత్యనారాయణరెడ్డి మట్కా రాస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు జరపగా అతని వద్ద మట్కా పట్టీతో పాటు రూ.7,320 నగదు దొరికిందన్నారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కణేకల్లు: కణేకల్లు క్రాస్ – బళ్లారి రోడ్డుమార్గంలో యర్రగుంట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యల్లప్ప (60) మంగళవారం రాత్రి బళ్లారి విమ్స్‌లో మృతి చెందాడు. బొమ్మనహాళ్ మండలంలోని ఏళంజి గ్రామానికి చెందిన అన్నదమ్ములు యల్లప్ప (60), రామాంజినేయులు (47) ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా బొమ్మనహాళ్ నుండి కణేకల్లుక్రాస్ వైపు వస్తున్న కారు ఢీకొన్న విషయం విదితమే. ఈ ఘటనలో అన్నదమ్ములిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని బళ్లారి విమ్స్‌లో చికిత్స కోసం చేరగా.. అక్కడ చికిత్స పొందుతూ యల్లప్ప మృతి చెందాడు. రామాంజినేయులు ప్రస్తుతం చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీలో కష్టపడిన వారికి ఎప్పటికీ సముచిత స్థానం ఉంటుందని పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కంబదూరు టౌన్ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు. పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులుగా పల్లడుగు అనిల్ కుమార్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.ఫయాజ్, బూత్ కమిటీ వింగ్ అధ్యక్షుడిగా గాజుల నాగరాజు, మేధావుల ఫోరం అధ్యక్షుడిగా ఎస్.మాబుసాబ్, దివ్యాంగుల విభాగం అధ్యక్షులుగా ఎం.వంశీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఎన్నికైన వారు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతం కోసం తమవంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయదుర్గంటౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.16.80 లక్షల విలువైన చెక్కులను 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పంపిణీ చేశారు. బుధవారం తన నివాసం వద్ద నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి విచ్చేసిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను అందించారు.